
సాక్షి
శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు

శుక్రవారం ı 20 ı సెప్టెంబర్ ı 2024



సోమశిలలో 51.13 టీఎంసీలు

సోమశిల: జలాశయంలో గురువారం సాయంత్రానికి 51.13 టీఎంసీల నీరు నిల్వ ఉంది. పెన్నార్ డెల్టాకు 600 క్యూసెక్కులను విడుదల చేస్తున్నారు.



బంగారం ధరలు

24 క్యారెట్లు (10 గ్రా)	రూ.75,770
22 క్యారెట్ల ఆర్నమెంట్ (గ్రా)	రూ.6,878
3 శాతం జీఎస్టీతో	రూ.7,084
సవర (8 గ్రా)	రూ.56,672

గరిష్టం/కనిష్టం
38.0 /28.2

వాతావరణం

జిల్లాలో వాతావరణం శుక్రవారం పొడిగానే ఉంటుందని ఆ శాఖ అధికారులు తెలిపారు. గాలిలో తేమ 61 శాతంగా గురువారం నమోదైంది.

న్యూస్‌రీల్

28న విజయ డెయిరీ ఎన్నికలు

నెల్లూరు(సెంట్రల్): నెల్లూరు జిల్లా పాల ఉత్పత్తిదారుల పరస్పర సహాయక సహకార సమితి (విజయ డెయిరీ) ఎన్నికలను ఈ నెల 28న నిర్వహించనున్నామని ఎన్నికల అధికారి హరిబాబు గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ముగ్గురు డైరెక్టర్లు ఈ నెలాఖరులో పదవీ విరమణ చేయనున్నారని చెప్పారు. ఈ క్రమంలో ఈ మూడు స్థానాలకు సంబంధించిన నోటిఫికేషన్‌ను ఈ నెల 20న జారీ చేయనున్నామని, 23న నామినేషన్ల స్వీకరణ, అదే రోజున పరిశీలన, నామినేషన్ల ఉపసంహరణకు 24వ తేదీ గడువని పేర్కొన్నారు. 28న ఓటింగ్ అనంతరం, అదే రోజు మధ్యాహ్నం ఓట్లను లెక్కించనున్నామని వివరించారు.

ఎమ్మెస్సెమ్ఈ ద్వారా రాయితీలు



కార్యక్రమానికి హాజరైన అతిథులు

నెల్లూరు (టౌన్): ఎమ్మెస్సెమ్ఈ ద్వారా యువ పారిశ్రామికవేత్తలకు వివిధ పరిశ్రమల స్థాపనకు రాయితీలు ఇస్తూ కేంద్ర ప్రభుత్వం ప్రోత్సహిస్తోందని పీఎంఈజీపీ అసిస్టెంట్ డైరెక్టర్ కోటిరెడ్డి పేర్కొన్నారు. నగరంలోని నారాయణ ఇంజినీరింగ్ కళాశాలలో ప్రధాన మంత్రి ఉపాధి కల్పన కార్యక్రమాన్ని ఖాదీ, గ్రామీణ పరిశ్రమ ఎమ్మెస్సెమ్ఈ మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో గురువారం నిర్వహించారు. కేవీఐసీ డైరెక్టర్, బీసీ కార్పొరేషన్ ఈడీ నిర్మలా దేవి, ఎస్బీఐ చీఫ్ మేనేజర్ శాంతిరాజ్, యూబీఐ రీజినల్ మేనేజర్ రాజశేఖర్, బ్యాంక్ మేనేజర్ హరనాథ్, శారద క్రియేషన్స్ నిర్వాహకులు శారద, ప్రిన్సిపల్ శ్రీనివాసులురెడ్డి, డీన్ విష్వక్సేన్‌రెడ్డి, ఏజీఎం శ్రీధర్, చంద్రమోహన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పరిశ్రమల స్థాపనకు ప్రత్యేక దృష్టి



మాట్లాడుతున్న ఆనంద్

నెల్లూరు(దర్గామిట్ట): జిల్లాలో పరిశ్రమల ఏర్పాటుకు ప్రత్యేక దృష్టి సారించి పారిశ్రామికాభివృద్ధికి కృషి చేయాలని కలెక్టర్ ఆనంద్ పేర్కొన్నారు. కలెక్టరేట్లోని శంకరన్ హాల్లో జిల్లా పరిశ్రమలు, ఎగుమతుల ప్రోత్సాహక కమిటీ సమావేశాన్ని గురువారం నిర్వహించారు. గత సమావేశంలో చర్చించిన అంశాలపై చేపట్టిన చర్యలను పరిశ్రమల శాఖ జీఎం సుధాకర్ తెలియజేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడారు. జిల్లాలో ఏర్పాటవుతున్న పరిశ్రమలకు అన్ని అనుమతులు, భూసేకరణ, నీటి వసతి, విద్యుత్ తదితర సదుపాయాలను వేగంగా కల్పించేందుకు అన్ని శాఖల అధికారులు కృషి చేయాలని కోరారు. పరిశ్రమల ఏర్పాటులో ఉన్న సమస్యలను పరిష్కరించాలని చెప్పారు. వీటికి సంబంధించి వస్తున్న దరఖాస్తులను నిబంధనల మేరకు ఆమోదించాలని చెప్పారు. దరఖాస్తులను ఎందుకు తిరస్కరిస్తున్నారనే అంశాన్ని ఆయా పరిశ్రమల నిర్వాహకులకు తెలియజేసి.. సరిచేయించాక మరోసారి దాఖలు చేయించాలని సూచించారు. క్లస్టర్ డెవలప్‌మెంట్ ప్రోగ్రామ్‌ను పక్కాగా అమలు చేయాలని ఆదేశించారు. జేసీ కార్తీక్, కమిషనర్ సూర్యతేజ, పరిశ్రమల శాఖ జీఎం సుధాకర్, ఏపీఐఐసీ డిప్యూటీ జోనల్ మేనేజర్ సురేష్, జెడ్ఎం శేఖర్‌రెడ్డి, లీడ్ బ్యాంక్ మేనేజర్ శ్రీకాంత్ ప్రదీప్, పొల్యూషన్ కంట్రోల్ బోర్డు ఈఈ రాజశేఖర్, ఉపాధి కల్పనాధికారి వినయ్‌కుమార్ పాల్గొన్నారు.

పారదర్శకంగా ఇసుక పంపిణీ

నెల్లూరు(దర్గామిట్ట): జిల్లాలో సులభతరంగా, పారదర్శకంగా ఇసుకను పంపిణీ చేసేందుకు అన్ని ఏర్పాట్లు చేస్తున్నామని సీఎం చంద్రబాబుకు కలెక్టర్ ఆనంద్ వివరించారు. ఏపీ సాండ్ మేనేజ్‌మెంట్ సిస్టమ్‌పై కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్‌ను అమరావతిలోని సచివాలయం నుంచి సీఎం గురువారం నిర్వహించారు. కలెక్టరేట్లోని తిక్కన ప్రాంగణం నుంచి కలెక్టర్, అధికారులు హాజరయ్యారు. జిల్లాలో ఇసుక పంపిణీ వివరాలను కలెక్టర్ తెలియజేశారు. 30 వేల టన్నుల ఇసుక అందుబాటులో ఉందని చెప్పారు. పోతిరెడ్డిపాళెం, సంగం, సూరాయపాళెం స్టాక్ యార్డుల నుంచి ఇసుకను సరఫరా చేస్తున్నామని వివరించారు. పల్లిపాడు, మినగల్లు, విరువూరు, పడమటికంభంపాడులో ఓపెన్ ఇసుక రీచ్‌లను మాన్యువల్ పర్మిషన్‌తో అక్టోబర్ 15 నుంచి అందుబాటులోకి తీసుకురానున్నామని చెప్పారు. జేసీ కార్తీక్, మైన్స్ డీడీ శ్రీనివాస్‌కుమార్, డీటీసీ చందర్, పొల్యూషన్ కంట్రోల్ బోర్డు ఈఈ రాజశేఖర్, ఆర్డీఓ మలోల తదితరులు పాల్గొన్నారు.

అరాచకాలపైనే సవారీ



- సహజ వనరుల దోపిడీపైనే తమ్ముళ్ల ఆసక్తి
- రెచ్చిపోతున్న మాఫియా
- ఊరూరా రెడ్‌బుక్ రాజ్యాంగం
- ప్రభుత్వ శాఖల్లో పడకేసిన పాలన
- కార్యాలయాల్లో తమ్ముళ్లు చెప్పిందే వేదం
- హామీలు.. హంఫట్
- కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వంద రోజుల్లో సాధించింది ఇదీ



'బాబు ష్యూరిటీ.. భవిష్యత్తు గ్యారెంటీ' నినాదంతో సూపర్ సిక్స్ పేరిట రూపొందించిన మేనిఫెస్టోతో గత ఎన్నికలకు ముందు టీడీపీ అధినేత చంద్రబాబు చేసిన హడావుడి అంతా ఇంతా కాదు. దీన్ని విశ్వసించిన ప్రజలు ఆ పార్టీని భారీ మెజార్టీతో గెలిపించారు. అయితే చివరికి ఏమైంది.. అధికారంలోకి వచ్చిన వంద రోజుల్లో ప్రజలకు ఉపయోగపడే కార్యక్రమం ఒక్కటైనా చేయలేదు. కానీ ప్రభుత్వం ఏర్పడ్డాక తమ్ముళ్లు ప్రకృతి వనరులను కొల్లగొడుతూ.. రెడ్‌బుక్ రాజ్యాంగాన్ని అమలు చేస్తూ.. ప్రశ్నించే గొంతుకలను చిదిమేస్తున్నారు. పంచాయతీ నుంచి కలెక్టరేట్ వరకు.. పోలీస్‌స్టేషన్ నుంచి ఎస్పీ కార్యాలయం వరకు.. తమ్ముళ్లు చెప్పించే వేదంగా మారిందంటే పరిస్థితి తీవ్రతను అర్థం చేసుకోవచ్చు.

సాక్షి ప్రతినిధి, నెల్లూరు: టీడీపీ ప్రభుత్వ వంద రోజుల పాలన హామీల విస్మరణకే పరిమితమైంది. ఒక్క పింఛన్ పెంపు మినహా సామాన్యులకు ప్రయోజనం చేకూర్చే ఏ పథకాన్నీ అమలు చేయలేదు. అస్తవ్యస్త పాలన.. బదిలీలు చేయించుకునేందుకు అధికారుల ఆరాటం.. వెరసి అంతా అయోమయంగా మారింది. ఈ నూరు రోజుల్లో ఎవరైనా లబ్ధి పొందారంటే అది టీడీపీ శ్రేణులే. కౌంటింగ్ ప్రక్రియ అనంతరం ఆ పార్టీ అధికారంలోకి వస్తుందనే అంశం స్పష్టమైన మరుక్షణం నుంచే సహజ వనరుల దోపిడీకి స్కెచ్ వేసి పక్కాగా అమలు చేస్తున్నారు.

రియల్ ఎస్టేట్ బేలచూపులు

ప్రస్తుత ప్రభుత్వ పాలన ప్రభావం రియల్ ఎస్టేట్ రంగంపై తీవ్ర ప్రభావం చూపుతోంది. ఏళ్ల క్రితం వేసిన అనధికార లేఅవుట్లపై ఎమ్మెల్యేలు పడ్డారు. వీటి యజమానులను బెదిరించి ఎకరాకు రూ.ఐదు లక్షల చొప్పున వసూలు చేస్తున్నారు. ఎవరైనా నిరాకరిస్తే అనధికార పేరుతో ప్లాట్ల రిజిస్ట్రేషన్ల ప్రక్రియను నిలిపేస్తున్నారు. రూ.కోట్లల్లో వసూలు చేసి తమ జేబులు నింపుకొంటున్నారు. ఈ పరిణామాల క్రమంలో జిల్లాలో రియల్ ఎస్టేట్ రంగం కుదేలైంది.

బదిలీలపైనే ధ్యాస

జిల్లాలో పాలనా వ్యవస్థ గాడినపడలేదు. జిల్లా అధికారుల బదిలీలు జరగలేదు. ఈ క్రమంలో జిల్లా అధికారులు సైతం ఆయా శాఖల్లో పనుల్లో వేగవంతాన్ని చూపలేకపోతున్నారు. మరోవైపు రెడ్‌బుక్ క్లియరెన్స్ పేరిట పోలీస్ శాఖలో బదిలీల్లో జాప్యమవుతుండటంతో జిల్లాలో శాంతిభద్రతల పరిస్థితి ఘోరంగా తయారైంది. నేతల చుట్టూ తిరిగి పోస్టులను కొనుగోలు చేయాల్సిన దుస్థితి ఏర్పడింది. ఈ పరిణామాలతో అధికార పార్టీ కనుసన్నల్లో పోలీస్ వ్యవస్థ పనిచేయాల్సి వస్తోంది. వీఆర్వో నుంచి తహసీల్దార్.. సచివాలయ సెక్రటరీ నుంచి ఎంపీడీఓ పోస్ట్ వరకు బదిలీలకు ఎమ్మెల్యేల సిఫార్సు లేఖలే కీలకంగా మారుతున్నాయి.

అవినీతిలో ప్రథమ స్థానం

సహజ వనరుల దోపిడీ మొదలుకొని పరిశ్రమలకు ఎస్ ట్యాక్స్.. పామాయిల్ ఫ్యాక్టరీల వద్ద టోల్‌ట్యాక్స్.. లే అవుట్ల యజమానుల నుంచి రూ.కోట్లల్లో వసూళ్లు.. ఇసుక, మట్టి, గ్రావెల్ అక్రమ రవాణా, డైమండ్ డబ్బా ఇలా చెప్పుకొంటూపోతే సర్వేపల్లి నియోజకవర్గంలో ఎన్నో సిత్రాలు వెలుగు చూశాయి. ప్రధాన ప్రతిపక్ష నేతలను టార్గెట్ చేసి అక్రమ కేసులు బనాయించడం.. దళితులపై పోలీసుల విచక్షణరహితంగా దాడులు చేయడం ఇక్కడ నిత్యకృత్యం. అవినీతిలో సర్వేపల్లి నియోజకవర్గం జిల్లాలో ప్రథమ స్థానంలో ఉందనే టాక్ లోకల్‌గా నడుస్తోంది.

వైఎస్సార్‌సీపీకి అనుకూలమా.. అయితే వేటే

ఉదయగిరి నియోజకవర్గంలో సాధించిన అభివృద్ధేమీ లేదు. మట్టి, ఇసుకను టీడీపీ నేతలు దోపిడీ చేస్తూ లక్షల్లో సంపాదిస్తున్నారు. జాతీయ ఉపాధి హామీ క్షేత్ర సహాయకులు 145 మంది ఉండగా, వీరిలో 120 మంది వరకు మార్చారు. నియోజకవర్గంలో ఐదుగురు పొదుపు గ్రూపు వీఓఏలను మార్చారు. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ మద్దతుదారులనే నెపంతో పాఠశాలల్లో మధ్యాహ్న భోజన నిర్వాహకులు, అక్కడే పనిచేసే పారిశుధ్య ఆయాలను తొలగించి తమకు అనుకూలమైన వారిని నియమించుకుంటున్నారు. వరికుంటపాడు, దుత్తలూరు, ఉదయగిరి మండలాల్లో అగ్రిగోల్డ్‌కు సంబంధించిన భూముల్లో సాగులో ఉన్న జామాయిల్‌ను ఎమ్మెల్యే ముఖ్య అనుచరులు కొంత మేర నరికి విక్రయించి సొమ్ము చేసుకుంటున్నారు. నియోజకవర్గంలోని నేతలు, అధికారులను సమన్వయం చేయడంలో ఎమ్మెల్యే విఫలమయ్యారనే విమర్శలు వినిపిస్తున్నాయి. కొన్ని మండలాల్లో ఎమ్మెల్యేతో సంబంధం లేకుండానే అధికారులను టీడీపీ నేతలు బెదిరించి, ఒత్తిడికి గురిచేసి ఇష్టానుసారంగా వ్యవహరిస్తూ సొంత పార్టీ నేతలు, కార్యకర్తలను ఇబ్బంది పెడుతున్నారు.

అరాచకాలకు అడ్డా..

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వంద రోజుల్లో ఆత్మకూరు నియోజకవర్గంలోని పలు గ్రామాల్లో అరాచకాలు చోటు చేసుకున్నాయి. అనంతసాగరం మండలం శంకరనగరంలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీకి చెందిన 18 మందిపై అక్రమంగా కేసులు బనాయించి జైలుకు పంపారు. రైతులపై రౌడీషీట్లు తెరిచారు. మద్యం విక్రయిస్తున్నారంటూ చేజర్ల మండలం టీకేపాడులో మహిళలపై అక్రమంగా కేసులు బనాయించారు. మర్రిపాడులోని డంపింగ్ యార్డులో ఇసుక దోపిడీ మొదలుకొని నియోజకవర్గంలోని అధిక చెరువుల్లో పూడికతీత పేరుతో అనధికారికంగా మట్టిని ఇటుక బట్టీలకు తరలించి సొమ్ముచేసుకుంటున్నారు. ప్రభుత్వ భూములు ఆక్రమణకు గురవుతున్నాయి. పెన్నా నుంచి రాత్రి వేళ ఇసుకను అక్రమంగా రవాణా చేసి భారీగా సంపాదించుకుంటున్నారు. ఇలా అక్రమాల్లో ఆ పార్టీ నేతలు ఆరితేరిపోయారు.

యథేచ్ఛగా దోపిడీ పర్వం

ఇసుక డంపింగ్ యార్డుల మొదలుకొని గ్రావెల్, చెరువులను కొల్లగొట్టేందుకే ప్రజాప్రతినిధులు, తమ్ముళ్లు పరిమితమయ్యారు. ఈ దోపిడీ పర్వం మూడు పువ్వులు.. ఆరు కాయలు అనే చందంగా సాగుతోంది. చిరుద్యోగులను బెదిరించడం.. రేషన్ డీలర్లను తొలగించడం.. ప్రభుత్వ మద్యం దుకాణాల్లో పనిచేసే వారిని ఎలాంటి కారణాల్లేకుండానే తప్పించడం.. ఉపాధి హామీ ఫీల్డ్ అసిస్టెంట్లు, అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులను బెదిరించి వారితో రాజీనామాలు చేయిస్తూ.. ప్రతి నియోజకవర్గంలో పోస్టులను అంగట్లో సరుకులా మార్చేశారు.

ఊరూరా దౌర్జన్యాలు

ఈ వంద రోజుల పాలనలో రెడ్‌బుక్ రౌడీయిజాన్ని అధికార పార్టీ నేతలు ఊరూరా అమలు చేస్తున్నారు. పోలీస్ వ్యవస్థను కీలుబొమ్మలా మార్చేసి అక్రమ కేసులు బనాయిస్తున్నారు. అభివృద్ధి కార్యక్రమాల కోసం గత ప్రభుత్వంలో వేసిన శిలాఫలకాలను ధ్వంసం చేస్తున్నారు. ప్రత్యర్థి పార్టీల ఇళ్లు కూలగొట్టడం .. ప్రభుత్వ భూములను కబ్జా చేయడం.. ప్రశ్నించే వారిపై కేసులు మోపి జైళ్లకు పంపుతూ పైశాచికానందాన్ని పొందుతున్నారు. గతంలో టీడీపీ నేతలపై ఉన్న కేసులను రాజీ పడేలా చేస్తున్నారు.

పేరుకే ఉచిత ఇసుక

ఉచిత ఇసుక అని ప్రభుత్వం ఆర్భాటంగా ప్రకటించినా, అది ఉత్తుత్తిగా మారింది. దీని పేరుతో నదులు, వాగులు, వంకలను తమ్ముళ్లు వదిలిపెట్టడంలేదు. అనధికారికంగా తరలించి అధిక ధరలకు విక్రయిస్తున్నారు. డిమాండ్ పెరగడంతో టన్ను ఇసుకను రూ.మూడు వేల మేర అమ్ముతున్నారు. మరో వైపు సరఫరా సక్రమంగా లేకపోవడంతో భవన కార్మికులు వీధిన పడ్డారు. గత మూడు నెలలుగా భవన నిర్మాణాలు పూర్తిగా నిలిచిపోయాయి. బ్లాక్ మార్కెట్లో ఇసుకను కొనలేక చాలా చోట్ల ఇదే పరిస్థితి నెలకొంది.

కక్ష సాధింపుల మినహా ఏమున్నాయ్



కూటమి ప్రభుత్వం ఏర్పడిన ఈ వంద రోజుల్లో కక్ష సాధింపు చర్యల మినహా సాధించిందేమీలేదు. సూపర్ సిక్స్ పథకాలు అంటూ ప్రజలను ఊదరగొట్టారు. తీరా ఓట్లు వేయించుకొని ఇప్పటికీ అమలు చేయలేదు. ఇది నమ్మించి ద్రోహం చేయడమే. ప్రజల నమ్మకాన్ని ఇప్పటికైనా నిలబెట్టాలి.

– అల్లారెడ్డి ఆనంద్‌రెడ్డి, ఆత్మకూరు

వ్యతిరేకత మొదలైంది



ప్రభుత్వం ఏర్పడిన నూరు రోజుల్లో ఏ హామీనీ అమలు చేయలేదు. దీనిపై ప్రజల్లో వ్యతిరేకత వ్యక్తమవుతోంది. నమ్మి ఓట్లేసినందుకు ఎలాంటి ప్రయోజనం లేదనే ఆవేదన ప్రజల్లో కనిపిస్తోంది.

– ఆంద్రా వెంకటసుబ్బారెడ్డి, ఆత్మకూరు

ఏ పథకం అమలు కాలేదు



కూటమి ప్రభుత్వ వంద రోజుల పాలనలో సంక్షేమ పథకాలు అమలు కాలేదు. పాలనపై ప్రజలు పెదవి విరుస్తున్నారు. హామీలను అమలు చేయకుండా సాగదీయడంపై ప్రజల్లో వ్యతిరేక భావన వచ్చింది. సంక్షేమ పథకాలను అమలు చేస్తేనే మంచి పాలన అవుతుంది.

– గోపాల్‌రెడ్డి, పొదలకూరు

రైతుల ఆశలపై నీళ్లు



ఎన్నికల్లో ఇచ్చిన హామీలను అమలు చేయకుండా రైతులను కూటమి ప్రభుత్వం ఇబ్బందులకు గురిచేస్తోంది. రాష్ట్ర ప్రభుత్వం నుంచి రైతులకు ఎలాంటి ఆర్థిక సాయం అందలేదు. గతంలో పంటల ప్రారంభ సమయంలోనే రైతు భరోసా ద్వారా ఆర్థిక సాయమిచ్చేవారు. అన్నదాత సుఖీభవగా మార్చి, రైతుకు రూ.20 వేలను ఇస్తామని ప్రకటించినా, నేటికీ అందజేయలేదు.

– శివుని నరసింహులురెడ్డి, వైస్ ఎంపీపీ, కోవూరు



రాజ్యమేలుతున్న రౌడీయిజం

కావలి నియోజకవర్గంలో రౌడీయిజం రాజ్యమేలుతోంది. ప్రత్యర్థి పార్టీ నేతలు.. దళిత మహిళా జర్నలిస్ట్‌పై కేసుల నమోదు నుంచి పాలన ప్రారంభమైంది. అనధికార లేఅవుట్ల పేరుతో విధ్వంసం సృష్టించారు. సొంత పార్టీ నేతలనే టార్గెట్ చేసి కేసులు నమోదు చేయించి నియోజకవర్గంలో రెడ్‌బుక్ రాజ్యాంగాన్ని అమలు చేస్తున్నారు. ఇక్కడ పోలీస్ యంత్రాంగం నిర్వీర్యమైంది. ఎమ్మెల్యే కనుసన్నల్లోనే ఎఫ్ఐఆర్‌లు నమోదవుతున్నాయి. తమ్ముళ్లు చెలరేగిపోయి ఇసుక, గ్రావెల్, మట్టిని విక్రయించి సొమ్ము చేసుకుంటున్నారు. చిరుద్యోగులను బెదిరించి బలవంతంగా రాజీనామాలు చేయించి తమ పార్టీ వారికి కట్టబెట్టారు.

బెదిరిస్తూ.. కండువాలు మారుస్తూ..!

నెల్లూరు రూరల్ నియోజకవర్గంలో రౌడీయిజం రాజ్యమేలుతోంది. ప్రత్యర్థి పార్టీ ప్రజాప్రతినిధులను బెదిరించి పార్టీ కండువాలు కప్పుతున్నారు. సహజ వనరుల దోపిడీ యథేచ్ఛగా జరుగుతోంది. ప్రభుత్వ భూములు ఆక్రమణకు గురవుతున్నాయి. నియోజకవర్గ పరిధిలో ప్రత్యర్థి పార్టీ అని చెప్పుకొనే పరిస్థితే లేదు.

బార్లు.. భయభ్రాంతులు

నెల్లూరు సిటీ నియోజకవర్గం అక్రమాలకు అడ్డాగా మారింది. పోలీసులు బరితెగించి గ్రానైట్ లారీలను అర్ధరాత్రి నిలిపి దందాలు సాగిస్తున్నారు. బార్ల యజమానులను భయభ్రాంతులకు గురిచేస్తున్నారు. కార్పొరేషన్లోని టౌన్‌ప్లానింగ్ విభాగంలో అధికారులు దందాలు సాగిస్తున్నారు. ప్రత్యర్థి పార్టీ ప్రజాప్రతినిధులను భయపెట్టి పార్టీ కండువాలు కప్పడానికే పరిమితమవుతున్నారు.

తగ్గని తమ్ముళ్లు

కోవూరు నియోజకవర్గంలో తమ్ముళ్లు బరితెగించి సహజ వనరులను దోపిడీ చేస్తున్నారు. మినగల్లు రీచ్‌లో 12 వేల టన్నుల ఇసుకను స్థానిక ఎమ్మెల్యే బంధువు దోపిడీ చేశారు. అవినీతికి ఎమ్మెల్యే దూరంగా ఉన్నా, తమ్ముళ్లు ఏ మాత్రం తగ్గడంలేదు. రీచ్‌లో అనధికారికంగా ఇసుక తరలింపు.. గ్రావెల్.. మట్టి అక్రమ రవాణాలో ముందుంటున్నారు. చివరికి చికెన్ వ్యర్థాల మాఫియాలోనూ తమ్ముళ్ల పాత్ర కీలకంగా మారింది.

సర్వం దోపిడీమయం

కందుకూరులో తమ్ముళ్ల అరాచక పాలన సాగుతోంది. చిరుద్యోగుల తొలగింపుతో పాలన ప్రారంభమైంది. ఇసుక, గ్రావెల్, మట్టి తరలింపు యథేచ్ఛగా సాగుతోంది. నేషనల్ హైవే పనులను నిలిపేసి కాంట్రాక్టర్‌ను బెదిరించి వసూళ్లు.. ఇలా ఒక్కటేమిటి అన్నింటా అవినీతిని పెంచి పోషిస్తున్నారు. ప్రభుత్వ మద్యం దుకాణాల్లో పనిచేసే చిరుద్యోగులనూ వదిలిపెట్టలేదు. రేషన్ డీలర్లు, ఉపాధి హామీ ఫీల్డ్ అసిస్టెంట్లను యథేచ్ఛగా తొలగించారు.

అటవీ అధికారుల తీరే వేరయా..!

- మేత పోరంబోకు కబ్జా
- రిజర్వ్ ఫారెస్ట్ భూమిని చదును చేసిన వైనం
- హైకోర్టు స్టేటస్‌కో ఉత్తర్వులు బేఖాతర్
- న్యాయస్థానాన్ని ఆశ్రయించిన గ్రామస్తులు

ఉదయగిరి అటవీ రేంజ్ పరిధిలోని పలువురు అధికారుల తీరు వివాదాస్పదంగా మారుతోంది. వరికుంటపాడు మండలం విరువూరు రెవెన్యూ పరిధిలో మేత పోరంబోకు భూములపై గ్రామస్తులు, అటవీ అధికారులకు మధ్య వివాదం నడుస్తోంది. దీనిపై గ్రామస్తులు హైకోర్టును ఆశ్రయించగా, స్టేటస్‌కో ఉత్తర్వులిచ్చారు. అయినా లెక్క చేయకుండా మొక్కలు నాటడంతో పాటు వివిధ పనుల పేరుతో హడావుడి చేస్తూ.. తాను బదిలీ అయ్యేలోపు బిల్లులు పెట్టుకోవాలనే రీతిలో ఓ అధికారి ముందుకెళ్తున్నారని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు.



విరువూరులోని వివాదాస్పద భూముల్లో దుక్కి చేసిన అటవీ అధికారులు



నాటేందుకు సిద్ధంగా మొక్కలు

ఉదయగిరి/వరికుంటపాడు: ఉదయగిరి అటవీ రేంజ్ పరిధిలోని కొందరు అధికారులు తమకెదురులేదనే రీతిలో ముందుకెళ్తూ వివాదాలకు కేరాఫ్‌గా మారుతున్నారు. అయిన కాడికి దండుకోవాలనే లక్ష్యంతో వీరు వ్యవహరిస్తున్నారని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. ఇప్పటికే ఓ అవినీతి బాగోతం వెలుగులోకి వచ్చి విచారణ జరుగుతున్న సమయంలోనే మరో అంశం తెరపైకి రావడం గమనార్హం.

ఇదీ వ్యవహారం..

వరికుంటపాడు మండలం విరువూరు రెవెన్యూ పరిధిలో గల సర్వే నంబర్ 518లో 846.88 ఎకరాలు.. సర్వే నంబర్ 98లో 417.5 ఎకరాల మేత, కొండ పోరంబోకు భూములున్నాయి. రెవెన్యూ రికార్డుల్లో సైతం ఇదే విధంగా నమోదయ్యాయి. ఇందులో 932 ఎకరాలను రిజర్వ్ ఫారెస్ట్‌గా 1981లో గెజిట్ చేశారని అటవీ అధికారులు చెప్తున్నా, వాటిని స్వాధీనం చేసుకోలేదు. వీటిని అటవీ భూములుగా కేటాయించిన అంశం గ్రామస్తులకూ తెలియదు. ఈ తరుణంలో 2007లో సదరు భూములను అటవీ అధికారులు స్వాధీనపర్చుకొని, ప్లాంటేషన్ చేసేందుకు యత్నించగా, గ్రామస్తులు అడ్డుకొని హైకోర్టును ఆశ్రయించారు. దీంతో అటవీ భూమికి హద్దులు నిర్ణయించుకొని ప్లాంటేషన్ చేయాలని ఆదేశిస్తూ అదే సంవత్సరం ఆగస్ట్‌లో ఉత్తర్వులు జారీ చేశారు. అయినా అటవీ అధికారులు తమకు గెజిట్ చేసిన భూములకు సర్వే చేయించుకొని హద్దులను ఏర్పాటు చేయలేదు. సదరు భూముల్లో ప్లాంటేషన్ చేసేందుకు 2010లో మరోసారి యత్నించగా, గ్రామస్తులు హైకోర్టును ఆశ్రయించారు. ఈ తరుణంలో గ్రామస్తుల సమక్షంలో గ్రామసభను ఏర్పాటు చేసి.. వారి ఆమోదం మేరకు రెవెన్యూ, ఫారెస్ట్ అధికారులు సంయుక్తంగా సర్వే జరిపి.. మేత పోరంబోకు, గెజిట్ చేసిన అటవీ భూములకు హద్దులు నిర్ణయించి, అప్పుడే తమ కార్యకలాపాలను చేపట్టాలని 2012లో కోర్టు తీర్పునిచ్చింది. పశువుల మేత కోసం రిజర్వ్ చేసిన ఫారెస్ట్ భూముల్లో ప్లాంటేషన్‌ను చేపట్టొద్దనీ ఆదేశించింది. అయితే దీనిపై క్షేత్రస్థాయిలో ఎలాంటి సర్వేను చేపట్టలేదు. మరోవైపు గ్రామసభను నిర్వహించకుండానే హద్దులను ఏర్పాటు చేసినట్లు రికార్డుల్లో పొందుపర్చారని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు.

అధికారి అత్యుత్సాహం

సమస్య కొలిక్కి రాక ముందే ఉదయగిరి రేంజ్ స్థాయిలోని ఓ అధికారి ఈ భూముల్లో 40 హెక్టార్లలో ప్లాంటేషన్ అభివృద్ధి కోసం నిధులను మంజూరు చేయించుకున్నారు. సదరు భూముల్లో ప్లాంటేషన్ చేసేందుకు దున్నడాన్ని ఈ ఏడాది ఫిబ్రవరిలో ప్రారంభించారు. దీన్ని అడ్డుకొని కోర్టును గ్రామస్తులు ఆశ్రయించగా, నాలుగు వారాల స్టేటస్‌కోను హైకోర్టు జూలై 31న జారీ చేసింది. ఆలోపు కౌంటర్ దాఖలు చేయాలని అటవీ అధికారులను ఆదేశించింది. అయితే ఎలాంటి కౌంటర్ వేయకుండానే ప్లాంటేషన్ వేశారు. కాగా త్వరలో సదరు రేంజ్ స్థాయి అధికారి వేరే ప్రాంతానికి బదిలీ అయ్యే అవకాశం ఉంది. ఈ క్రమంలో పనులను త్వరగా పూర్తి చేసి బిల్లులను పొందాలనే లక్ష్యంతో సదరు అధికారే కాంట్రాక్టర్ అవతారమెత్తారు. దీనిపై కృష్ణంపల్లి ఫారెస్ట్ అధికారి చినవెంకటయ్యను సంప్రదించగా, తాను ఇటీవలే బాధ్యతలు చేపట్టానని, తనకేమీ తెలియదని బదులిచ్చారు. రేంజర్‌ను సంప్రదించేందుకు యత్నించగా, ఆయన అందుబాటులోకి రాలేదు.

న్యాయ పోరాటం చేస్తున్నాం



మా గ్రామానికి సంబంధించిన మేత పోరంబోకు భూములను కాజేసేందుకు అటవీ అధికారులు యత్నిస్తున్నారు. ప్లాంటేషన్ చేసి నిధులు దిగమింగే యత్నంలో భాగంగా కోర్టు ఉత్తర్వులను సైతం ఉదయగిరి రేంజ్ అధికారి ధిక్కరిస్తున్నారు. దీంతో హైకోర్టును ఆశ్రయించాం. తప్పు చేసిన అధికారులపై పోరాటం చేస్తున్నాం.

– మురళీకృష్ణ, వైఎస్సార్‌సీపీ నేత, విరువూరు

కోర్టు ఉత్తర్వుల మేరకు చర్యలు

విరువూరు భూ సమస్య కోర్టులో ఉంది. దీనిపై గ్రామస్తులు స్టేటస్‌కో తెచ్చుకున్నారు. దీంతో భూముల్లోకి ఎవరూ వెళ్లడంలేదు. గతంలో కొంత భూమిని ఫారెస్ట్‌కు కేటాయిస్తూ గెజిట్టైంది. కొంతమేర సర్వే సైతం జరిగింది. కోర్టు ఆదేశాల మేరకు తదుపరి చర్యలు చేపడతాం.

– హుస్సేన్, తహసీల్దార్, వరికుంటపాడు

క్లుప్తంగా

సమస్యలు పరిష్కరించే వరకు..

• ఆందోళనలు చేస్తూనే ఉంటాం



ఆందోళన చేస్తున్న డాక్టర్లు

నెల్లూరు(అర్బన్): సమస్యలను ప్రభుత్వం పరిష్కరించే వరకు ఆందోళనలు విరమించే ప్రసక్తే లేదని ఏపీ పీహెచ్‌సీల డాక్టర్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ అమరేంద్రనాథ్‌రెడ్డి, సెక్రటరీ డాక్టర్ శ్రీనివాసులు స్పష్టం చేశారు. రోజువారీ ఆందోళనల్లో భాగంగా గురువారం నెల్లూరు సంతపేటలోని జిల్లా వైద్యశాఖ కార్యాలయం వద్ద పలువురు డాక్టర్లు ధర్నా చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సమయానుకూల ప్రమోషన్లు ఇవ్వాలని, పీజీ సీట్లకు సంబంధించి జీఓ నంబర్ 85ను రద్దు చేయాలని, గిరిజన ప్రాంతాల్లో పని చేస్తున్న వైద్యాధికారులకు 30 శాతం ట్రైబల్ అలవెన్సు అమలు చేయాలని, ఫ్యామిలీ ఫిజిషియన్ కార్యక్రమంలో పాల్గొంటున్న వారికి అలవెన్సు మంజూరు చేయాలన్నారు. తమ డిమాండ్ల సాధన కోసం ఆందోళనలు ఉధృతం చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ నాయకులైన డాక్టర్లు రవీంద్రనాథ్‌రెడ్డి, అహ్మద్ బాబు, నవీన్‌కుమార్‌రెడ్డి, అనూష కుమారి, మోహతాబ్, హర్షిత, సురేంద్ర, బలరామనాయక్ తదితరులు పాల్గొన్నారు.

రైలు ఢీకొని మహిళ మృతి

వెంకటాచలం: రైలు ఢీకొని గుర్తుతెలియని మహిళ మృతిచెందిన ఘటన వెంకటాచలంలోని రైల్వేస్టేషన్ సమీపంలో గురువారం జరిగింది. సుమారు 50 సంవత్సరాల వయసున్న మహిళ మూడు రోజుల నుంచి వెంకటాచలం రైల్వేస్టేషన్ పరిసర ప్రాంతాల్లోనే తిరుగుతూ రాత్రి సమయంలో అక్కడే నిద్రించేది. గురువారం రైలు ఢీకొనడంతో ఆమె అక్కడికక్కడే మృతిచెందింది. సిబ్బంది సమాచారం ఇవ్వడంతో రైల్వే పోలీసులు మృతదేహాన్ని పరిశీలించి పోస్టుమార్టం నిమిత్తం నెల్లూరులోని జిల్లా ప్రభుత్వాస్పత్రికి తరలించారు.

చెన్నై నగరానికి కండలేరు జలాల విడుదల

రాపూరు: చెన్నై నగర ప్రజల దాహార్తి తీర్చేందుకు కండలేరు హెడ్ రెగ్యులేటర్ వద్ద ఉన్న పవర్‌ప్లాంట్ యూనిట్ నుంచి గురువారం నీటిని విడుదల చేశారు. ముందుగా వెంకటగిరి ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ, తెలుగుగంగ ఎస్‌ఈ రమణారెడ్డి గంగమ్మ తల్లికి ప్రత్యేక పూజలు చేసి, స్విచ్చాన్ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్రంలో అన్ని జలాశయాల్లో పుష్కలంగా నీటి నిల్వలు ఉన్నాయన్నారు. వాటి ద్వారా కండలేరు జలాశయంలో పూర్తిస్థాయిలో నీటిని నిల్వ చేస్తామన్నారు. ఈసారి అన్ని అనుకూలిస్తే 56 టీఎంసీల వరకు నిల్వ చేయనున్నట్లు తెలిపారు. మొదటగా 500 క్యూసెక్కుల నీటిని విడుదల చేశామని, శుక్రవారం 1,200 క్యూసెక్కులకు పెంచుతామన్నారు. ప్రస్తుతం తిరుపతి నగరానికి 200 క్యూసెక్కులు నీటిని విడుదల చేస్తున్నట్లు తెలిపారు. ప్రస్తుతం కండలేరు జలాశయంలో 15.753 టీఎంసీల నీరు నిల్వ ఉందన్నారు. సోమశిల జలాశయం నుంచి 8,300 క్యూసెక్కులు చేరుతున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఈఈ విజయకుమార్‌రెడ్డి, డీఈ విజయరామిరెడ్డి, ఏఈ తిరుమలయ్య పాల్గొన్నారు.

ఆప్రాన్ పనుల పరిశీలన



జలాశయం వద్ద ఎస్‌ఈ

సోమశిల: సోమశిల ప్రాజెక్ట్ వద్ద జరుగుతున్న ఆప్రాన్ పనులను గురువారం జలాశయ ఎస్‌ఈ వెంకటరమణారెడ్డి పరిశీలించారు. నీటి లీకేజీ నియంత్రణ పనుల గురించి ఆయన తొలుత అధికారులను అడిగి తెలుసుకున్నారు. డైవర్షన్ కెనాల్లో ఉన్న లీకేజీ నీటి నిల్వను పంపింగ్ చేసి వాల్ నిర్మాణ పనులను వేగవంతం చేయాలని సూచించారు. ఐఏబీ సమావేశం లోగా పనులను పూర్తి చేయాలన్నారు. వచ్చే ఏడాది ఆగస్టులోగా ఆప్రాన్ పనులు పూర్తి చేస్తామని సదరు కాంట్రాక్టర్ హామీ ఇచ్చారన్నారు. కార్యక్రమంలో ప్రాజెక్ట్ ఈఈ పి.దశరథరామిరెడ్డి, జేఈలు రామ్మోహన్‌రెడ్డి, నిఖిల్, సిబ్బంది పాల్గొన్నారు.

వ్యభిచార కేంద్రంపై దాడి

నెల్లూరు(క్రైమ్): ఇళ్ల మధ్యలో గుట్టుచప్పుడు కాకుండా నిర్వహిస్తున్న వ్యభిచార కేంద్రంపై పోలీసులు దాడి చేసి నిర్వాహకులు, విటులను అరెస్ట్ చేశారు. పోలీసుల కథనం మేరకు.. నెల్లూరు నగరానికి చెందిన ఖతీజా, సమీ దంపతులు 20 రోజుల క్రితం బాలాజీ నగర్ పుట్టవీధిలో ఓ ఇంటిని అద్దెకు తీసుకుని వ్యభిచార కేంద్రం నిర్వహిస్తున్నారు. దీనిపై సమాచారం అందుకున్న ఆ ప్రాంత ఇన్‌స్పెక్టర్ కె.సాంబశివరావు తన సిబ్బందితో కలిసి గురువారం ఇంటిపై దాడి చేశారు. నిర్వాహకులతోపాటు సెక్స్‌వర్కర్, నగరానికి చెందిన వెంకటేశ్వర్లును అదుపులోకి తీసుకుని పోలీసుస్టేషన్‌కు తరలించారు. సెక్స్‌వర్కర్‌ను హోంకు పంపి నిర్వాహకులు, విటుడిపై కేసు నమోదు చేశారు.

సాగునీటికి ఎదురుచూపులు!

సోమశిలలో 51 టీఎంసీలు


- ఎగువ జలాలతో నిండుతున్న జలాశయం
- ఆలస్యమవుతున్న ఐఏబీ సమావేశం
- సాగునీరు కావాలని కోరుతున్న రైతులు
- పట్టించుకోని కూటమి ప్రభుత్వం

అన్నదాతలకు సంబంధించిన అంశాల్లో కూటమి ప్రభుత్వం నిర్లక్ష్యంగా ఉంటోంది. వారికి లబ్ధి చేకూర్చే నిర్ణయాలు తీసుకోవడంలో అలసత్వం ప్రదర్శిస్తోంది. సోమశిల జలాశయం నిండు కుండలా మారుతోందని జిల్లా రైతాంగం సంతోషిస్తోంటే ఐఏబీ సమావేశం పెట్టి నీటి పంపిణీపై నిర్ణయం తీసుకోవాల్సిన ప్రభుత్వ పెద్దలు ఆలస్యం చేస్తున్నారు.


ఆత్మకూరు: అనంతసాగరం మండలంలోని సోమశిల జలాశయం జిల్లా రైతులకు వరప్రదాయిని. ఈ ఏడాది ఈ ప్రాంతంలో వర్షాలు లేకుండానే ఎగువ నుంచి వస్తున్న జలాలతో సగానికిపైగా నిండింది. వాస్తవానికి అక్టోబర్, నవంబర్ నెలలు జిల్లాకు తుపాన్ల సీజన్‌గా పేరుంది. ఈ సమయంలో వర్షాలు బాగా కురిసి జలాశయానికి నీరు చేరడం చాలా సంవత్సరాలుగా జరుగుతోంది. అయితే గత వైఎస్సార్‌సీపీ పాలనలో ఎగువ నుంచి కృష్ణా జలాలను ప్రణాళిక మేరకు నడిపించి జలాశయానికి మళ్లించారు. దీనికితోడు జిల్లాలో పడిన వర్షాలతో 78 టీఎంసీలకు చేరిన సందర్భాలున్నాయి. ఈ క్రమంలో రైతాంగానికి ఎలాంటి ఢోకా లేకుండా నాలుగేళ్లపాటు సాగునీరు పుష్కలంగా లభించింది.

ఆలోచన చేయకుండా..

ఈ ఏడాది కృష్ణా నదికి అధికంగా వచ్చిన వరదలతో దిగువకు నీటిని వదలడంతో ఆదినిమ్మాయపల్లి మీదుగా జలాశయానికి 51 టీఎంసీల నీరు చేరింది. అక్టోబర్, నవంబర్ నెలల్లో వర్షాలు కురిసే అవకాశమున్న నేపథ్యంలో జిల్లా ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు జలాశయం నుంచి ముందస్తుగా కండలేరు జలాశయంలో నీరు నిల్వ చేసే లక్ష్యంతో రోజుకు 10 వేల క్యూసెక్కుల చొప్పున విడుదల చేస్తున్నారు. ఈ విషయంలో ముందు జాగ్రత్త తీసుకుంటున్న అధికారులు.. జిల్లా రైతుల గురించి ఆలోచన చేయడం లేదు. ప్రధాన చెరువులకు నీటిని విడుదల చేసి ముందస్తుగా నింపితే సాగుకు ప్రయోజనకరంగా ఉంటుందని పలువురు అభిప్రాయపడుతున్నారు. జిల్లా సాగునీటి సంఘం సలహా మండలి (ఐఏబీ) నిర్ణయం మేరకే నీటిని విడుదల చేయాల్సిన నిబంధన ఉన్న విషయం తెలిసిందే. ఈ సమావేశం ఎప్పుడు నిర్వహిస్తారా అని రైతాంగం ఎదురుచూస్తోంది.



సోమశిల జలాశయం



గతంలో ఇలా..

గత టీడీపీ ప్రభుత్వ కాలంలోనే (2014–19)లో జలాశయంలో నీటి లభ్యత తగినంత లేదు. కేవలం 25 టీఎంసీలున్న క్రమంలో 2016లో ఐఏబీ సమావేశం నిర్ణయం మేరకు తొలుత డెల్టాకు అనంతరం ఉత్తర, దక్షిణ కాలువలకు నీరు వదిలిన సందర్భాలను రైతులు గుర్తు చేస్తున్నారు. ప్రస్తుతం 51 టీఎంసీలు ఉండగా ఇంకా ఎగువ నుంచి రోజు 12 వేల క్యూసెక్కులకు పైగా వరద చేరుతుండడం, రాబోయే నెలల్లో వర్షాలు కురిసే అవకాశం ఉండడం తదితర అంశాలను దృష్టిలో ఉంచుకొని మేజర్ చెరువులకు నీరు విడుదల చేయాలని, దాని వల్లన భూగర్భ జలాలు నీటి మట్టం పెరగడంతోపాటు చెరువులకు నీరు చేరుతుందని రైతాంగం కోరుతోంది.

ఆందోళనలో రైతులు

బోర్లు, బావులు ఆధారంగా అనంతసాగరం, ఆత్మకూరు, సంగం, చేజర్ల, బుచ్చిరెడ్డిపాళెం తదితర మండలాల్లో సుమారు మూడు వేల ఎకరాలకుపైగా రెండోకారు కింద వరి, పత్తి తదితర పంటలను రైతులు సాగు చేస్తున్నారు. గరిష్ట ఉష్ణోగ్రతల కారణంగా భూగర్భ జలాలు అడుగంటాయి. బోర్లలో నీరు రాక వరి పైరు చివరి దశలో (వెన్ను దశ) రెండు తడుల నీళ్ల అవసరం ఉంది. సోమశిలలో 51 టీఎంసీల నీరు చేరిన క్రమంలో కలెక్టర్, ఉన్నతాధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించి ఐఏబీ సమావేశంతో సంబంధం లేకుండా ఉత్తర, దక్షిణ కాలువలకు నీరు విడుదల చేసేలా నిర్ణయం తీసుకోవాలని అన్నదాతలు కోరుతున్నారు.

జలాశయంలో నీటి నిల్వలిలా..

తేదీ	నీటి నిల్వ (టీఎంసీల్లో)	పైతట్టు ప్రాంతాల నుంచి ఇన్‌ఫ్లో (క్యూసెక్కుల్లో)
12	48.777	14,490
13	49.195	15,200
14	49.476	15,200
15	49.819	14,050
16	50.158	14,300
17	50.507	14,300
18	50.796	13,050
19	51.13	12,900

ఉన్నతాధికారుల నిర్ణయం మేరకే..

జలాశయంలో ప్రస్తుతం 51 టీఎంసీల నీరు నిల్వ ఉంది. మరో నాలుగు టీఎంసీలకుపైగా ఎగువ నుంచి నీరు వచ్చే అవకాశం ఉందని భావిస్తున్నాం. కలెక్టర్, ఐఏబీ సమావేశం మేరకే నీటిని విడుదల చేయాల్సి ఉంటుంది. వారి నిర్ణయం మేరకే విడుదల చేస్తాం.

– దశరథరామిరెడ్డి, ఈఈ, సోమశిల జలాశయం

క్రీడలతో ఉద్యోగుల మధ్య స్నేహభావం

• సీఎండీ సంతోషరావు

నెల్లూరు(వీఆర్సీసెంటర్): 'క్రీడా పోటీల్లో పాల్గొనడం వల్ల ఉద్యోగుల మధ్య స్నేహభావం పెంపొందుతుంది. గెలుపోటములు ముఖ్యం కాదు. పోటీల్లో పాల్గొనడమే ప్రధానం' అని ఏపీఎస్పీడీసీఎల్ సీఎండీ కె.సంతోషరావు అన్నారు. సంస్థలో పనిచేసే ఉద్యోగులకు నెల్లూరు క్లబ్‌లో మూడురోజులపాటు క్రీడా పోటీలు జరుగుతాయి. వీటికి సంబంధించిన ప్రారంభోత్సవ కార్యక్రమాన్ని విద్యుత్ భవన్‌లో గురువారం నిర్వహించారు. సీఎండీ జ్యోతిప్రజ్వలన చేశారు. కార్యక్రమంలో ఏపీఎస్పీడీసీఎల్ డైరెక్టర్ (ఫైనాన్స్) లక్ష్మీనరసయ్య, కృష్ణపట్నం జెన్‌కో చీఫ్ ఇంజినీర్ సుధీర్‌బాబు, ఏపీఎస్పీడీసీఎల్ చీఫ్ జనరల్ మేనేజర్ ధర్మజ్ఞాని, జిల్లా ఎస్‌ఈ విజయన్, ట్రాన్స్‌కో ఎస్‌ఈ బీవీ శేషారెడ్డి, జిల్లా స్పోర్ట్స్ కౌన్సిల్ సెక్రటరీ, ఈఈ శ్రీధర్, నెల్లూరు క్లబ్ అధ్యక్ష, కార్యదర్శులు శివప్రసాద్‌రెడ్డి, సుధాకర్‌రెడ్డి, స్పోర్ట్స్ ఆఫీసర్ కుమార్ వడివేలు, గేమ్స్ సెక్రటరీ వేలు, నవీన్ తదితరులు పాల్గొన్నారు.



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న సంతోషరావు



బ్యాడ్మింటన్ పోటీలో తలపడుతున్న ఉద్యోగులు

విజేతలు

➡ టెన్నిస్ సింగిల్స్ విభాగంలో నెల్లూరు జిల్లా జట్టు వైఎస్సార్ జిల్లాపై 5–0 పాయింట్లతో విజయం సాధించింది.

➡ బ్యాడ్మింటన్‌లో మొదటి రౌండ్‌లో లోయర్ సీలేరు జట్టు ప్రత్యర్థి నాగార్జునసాగర్ జట్టుపై 3–1 తేడాతో, గుంటూరు జట్టు ఓఎంసీ నెల్లూరు జట్టుపై 3–0తో, అనంతపురం జట్టు శ్రీశైలం జట్టుపై 3–0తో, వీటీపీఎస్ జట్టు ఓఎంసీ కడప జట్టుపై 3–2తో, రాజమండ్రి జట్టు వైజాగ్‌పై 3–1 పాయింట్లతో విజయం సాధించాయి.

➡ రెండో రౌండ్‌లో కృష్ణపట్నం జట్టు తిరుపతి కార్పొరేట్ ఆఫీస్ జట్టుపై 3–0 తేడాతో, తిరుపతి జట్టు లోయర్ సీలేరు జట్టుపై 3–0తో, ఓఎంసీ వైజాగ్ జట్టు ఓఎంసీ కర్నూలు జట్టుపై 3–2 పాయింట్లతో, విజయనగరం జట్టు గుంటూరు జట్టుపై 3–0 పాయింట్లతో విజయం సాధించాయి.

టేబుల్ ఫ్యాన్ రిపేర్ చేస్తుండగా..

• విద్యుదాఘాతానికి గురై వ్యక్తి మృతి



హజరత్తయ్య మృతదేహం

చేజర్ల: టేబుల్ ఫ్యాన్ రిపేరు చేస్తుండగా ప్రమాదవశాత్తు విద్యుత్ షాక్‌కు గురై ఓ వ్యక్తి మృతిచెందిన ఘటన మండలంలోని కోటితీర్థం ఎస్సీ కాలనీలో బుధవారం రాత్రి జరిగింది. గురువారం పోలీసులు వివరాలు వెల్లడించారు. కాలనీకి చెందిన అరిగి హజరత్తయ్య (40) చిన్నపాటి కూలీ పనులు, కరెంట్ పని చేసుకుని జీవనం సాగిస్తుంటాడు. అతడికి భార్య, ముగ్గురు పిల్లలున్నారు. బుధవారం రాత్రి ఇంటికొచ్చిన సమయంలో టేబుల్ ఫ్యాన్ ఆగిపోగా రిపేరు చేయడం ప్రారంభించాడు. ఈ సమయంలో కరెంట్ షాక్‌కు గురై కింద పడిపోయాడు. భార్య సుమలత, తండ్రి అరిగి రామయ్య గుర్తించి అతడిని ఆత్మకూరు ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. పరీక్షించిన వైద్యులు అప్పటికే హజరత్తయ్య మృతిచెందినట్లు తెలిపారు. దీంతో కోటితీర్థం గ్రామంలో విషాదం నెలకొంది. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

నిమ్మ ధరలు (కిలో)



పెద్దవి : రూ.100 పండ్లు : రూ.35
సన్నవి : రూ.45

నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్ ధరలు

బ్రాయిలర్ (లైవ్)	: 121
లేయర్ (లైవ్)	: 115
బ్రాయిలర్ చికెన్	: 220
బ్రాయిలర్ స్కిన్‌లెస్	: 244
లేయర్ చికెన్	: 195



15లోపు ప్లాన్ తయారు చేయాలి

• కలెక్టర్ ఆనంద్

నెల్లూరు(దర్గామిట్ట): జిల్లాలోని వృద్ధి కారకాలను గుర్తించి విజన్ యాక్షన్ ప్లాన్ 2047ను అక్టోబర్ 15లోపు తయారు చేయాలని కలెక్టర్ ఒ.ఆనంద్ ఆదేశించారు. స్వర్ణాంధ్ర 2047 విజన్ డాక్యుమెంట్ తయారీపై గురువారం రాష్ట్ర సచివాలయం నుంచి ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి నీరబ్‌కుమార్ ప్రసాద్ కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. నెల్లూరు కలెక్టరేట్‌లోని తిక్కన ప్రాంగణం నుంచి ఆనంద్, అధికారులు హాజరయ్యారు. అనంతరం ఆయన వివిధ శాఖల జిల్లా అధికారులతో మాట్లాడారు. రామాయపట్నం పోర్టు, కృష్ణపట్నం పోర్టు, జువ్వలదిన్నె ఫిషింగ్ హార్బర్‌తోపాటు అనుబంధ పరిశ్రమలు, టెంపుల్ టూరిజం మొదలైన వాటిని పరిగణనలోకి తీసుకోవాలన్నారు. ఆక్వా పరిశ్రమలను, జిల్లాలోని పశ్చిమ ప్రాంతాన్ని హార్టికల్చర్ హబ్‌గా తీర్చిదిద్దేందుకు వివరాలను డాక్యుమెంట్‌లో పొందుపరచాలన్నారు. నివేదికలను జిల్లా ప్రణాళికాధికారికి ఇవ్వాలని ఆదేశించారు. కార్యక్రమంలో డీఆర్వో లవన్న, ముఖ్య ప్రణాళికాధికారి రాజు తదితరులు పాల్గొన్నారు.



వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న అధికారులు

విధి నిర్వహణలో అలసత్వం వద్దు

• ఎస్పీ జి.కృష్ణకాంత్

ఆత్మకూరు: విధి నిర్వహణలో అలసత్వం చూపొద్దని పోలీస్ అధికారులు, సిబ్బందికి ఎస్పీ జి.కృష్ణకాంత్ సూచించారు. ఆత్మకూరు పోలీస్‌స్టేషన్‌ను ఆయన గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. అనంతరం డీఎస్పీ కార్యాలయంలో డివిజన్ పరిధిలోని ఎస్సైలు, సీఐలతో సమీక్ష నిర్వహించారు. ఎస్పీ మాట్లాడుతూ స్టేషన్ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలన్నారు. మొక్కలు నాటి పచ్చదనం పరిరక్షించాలని చెప్పారు. శాంతిభద్రతలపై ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. పాత నేరస్తులు, రౌడీషీటర్లపై నిఘా ఉంచాలన్నారు. కార్యక్రమంలో డీఎస్పీ వేణుగోపాల్, సీఐ జి.గంగాధర్, ఎస్సైలు జిలానీ, శ్రీనివాసులురెడ్డి పాల్గొన్నారు.



ఆత్మకూరు: పోలీసులతో మాట్లాడుతున్న ఎస్పీ

• సంగం: ఎస్పీ కృష్ణకాంత్ గురువారం సంగం పోలీస్‌స్టేషన్‌కు వచ్చారు. సీఐ వేమారెడ్డి, సిబ్బందితో మాట్లాడారు. సైబర్ మోసాలు, ఇసుక అక్రమ రవాణా, రోడ్డు ప్రమాదాలు, బాలికలపై జరిగే నేరాల విషయంలో జాగ్రత్తగా ఉండాలన్నారు. శిథిలావస్థలో ఉన్న పట్టుబడిన వాహనాలను కోర్టు అనుమతితో వేలం వేయాలని ఆదేశించారు.

అండర్–19 బాస్కెట్‌బాల్ జట్ల ఎంపికలు



బాలుర జట్టుతో నిర్వాహకులు



బాలికల జట్టుతో నిర్వాహకులు

కందుకూరు రూరల్: ఉమ్మడి ప్రకాశం జిల్లా అండర్–19 బాలబాలికల బాస్కెట్‌బాల్ క్రీడాకారుల ఎంపికలు కందుకూరు టీఆర్ఆర్ ప్రభుత్వ జూనియర్ కళాశాల క్రీడా మైదానంలో గురువారం జరిగాయి. 50 మంది పోటీ పడినట్లు పీడీ టి.సుబ్బారావు తెలిపారు. ఎంపికైన జట్లు రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొంటాయన్నారు. కార్యక్రమంలో పీడీలు కె.శంకరావు, వేణుగోపాల్‌రెడ్డి, సయ్యద్ జిలానీబాషా, రాజు పాల్గొన్నారు.